

కార్యదర్శులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు విధుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరిస్తూ క్రమశిక్షణగా మెలగాలని కమిషనర్ హరిత సూచించారు. స్థానిక 28/3 న్యూ మిలిటరీ కాలనీ వార్డు సచివాలయాన్ని కమిషనర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. ఆస్తి పన్ను, యూజర్ ఛార్జీల వసూళ్లను సచివాలయ కార్యదర్శులు మరింత వేగవంతం చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకాలు అందేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. రీ సర్వే పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన డ్రెస్ కోడ్ యూనిఫామ్ ధరించాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న కమిషనర్ హరిత

వైసిపిలో 'నేదురుమల్లి' జోష్..!

వైసిపిలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితుల్లో వెంకటగిరి పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమించిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జోష్ పెంచారు. బుధవారం నెల్లూరులో తన అనుచరులను కలిశారు. ఇక్కడ నుంచి కారుల్లో ర్యాలీగా వెంకటగిరి బయల్దేరి వెళ్లారు. అక్కడ హంగామా సృష్టించారు. ఎంఎల్ఎ ఆనం రామ నారాయణరెడ్డిపై విమర్శలు ఎక్కుపెట్టారు. పార్టీలో జరుగుతోన్న పరిణామాలపై ఆనం ఏ మాత్రమూ స్పందించలేదు. కనీసం పట్టించుకోలేదు. పార్టీ నుంచి తనకు ఎలాంటి నోటీసులు అందలేదని, తాను స్పందించాల్సిన అవసరం లేదని చెప్పి, కలువాయిలో ప్రభుత్వ కార్యక్రమాల్లో యథా విధిగా పాల్గొన్నారు. వెంకటగిరి వైసిపిలో ఆనం, నేదురుమల్లి రెండు గ్రూపులుగా బయటకు వచ్చారు. వెంకటగిరి రాజాలు ఎటు వైపు ఉన్నారో చూడాల్సి ఉంది. ఎంఎల్ఎగా మరో ఏడాదిన్నర పాటు అవకాశం ఉండడంతో ఆనం ఎలా వ్యవహరిస్తారనే విషయంపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

◆'ఆనం'పై విమర్శలు
◆పార్టీ నిర్ణయంపై నోరెమెదపని ఎంఎల్ఎ
◆ప్రభుత్వ కార్యక్రమాల్లో షరామామూలే

నెల్లూరు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాసంలో సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపిలో తాజా రాజకీయ పరిస్థితుల్లో వెంకటగిరి నియోజకవర్గంలో రెండు, మూడు గ్రూపులుగా కనిపిస్తున్నాయి. మంగళవారం ఆనంకు వ్యతిరేకంగా ఆపార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. వైసిపి, ప్రభుత్వపై వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి కొద్ది రోజులుగా విమర్శలు చేస్తున్నారు. అనేక సార్లు విమర్శలు చేసినా ఇటీవల ఘాటుగా స్పందిస్తున్నారు. మంగళవారం మళ్లీ ఆనం రామనారాయరెడ్డి వివాదస్పద వ్యాఖ్యలు చేసి, ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్డు వేయడంలేదని, కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకురావడం లేదని, ముందస్తు ఎన్నికలు జరిగితే అందరూ ఇంటికి వెళతారని చెప్పడంతో మీడియాలో తీవ్ర చర్చసాగింది. వెంటనే పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఆనంతో కనీసం మాట్లాడకుండా, షోకాజ్ నోటీసులు జారీ చేయకుండా నేదురు మల్లి రామ్‌కుమార్‌రెడ్డిని రాత్రికి రాత్రే నియమించారు. ఈ విషయం కనీసం ఆయనతో చెప్పకపోవడంతో పార్టీలో ఏం జరుగుతుందో అంతుపట్టలేదు. తనను కలిసిన మీడియాతోనూ ఇదే విషయం చెప్పారు. తనకు ఏలాంటి నోటీసులు రాలేదని, రామ్‌కుమార్‌రెడ్డిని నియమించే విషయం తెలియదని స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయం రావడంతో ఏదో జరిగిపోతుందని అందరూ భావించారు. పార్టీ నిర్ణయంపై ఆనం ఏమీ మాట్లాడలేదు. ఏం జరుగుతుందో చూడాలనే ఉద్దేశంతో మౌనంగా ఉన్నారని తెలుస్తోంది. బుధవారం ఉదయం యథావిధిగా కలువాయి మండలంలో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజక వర్గంలో జరుగుతోన్న విషయాలను ఏ మాత్రం పట్టించుకోకుండా కార్యక్రమాలు నిర్వహించారు. ఆనం అనుచరులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

'నేదురుమల్లి' జోష్..!

మాజీ ముఖ్యమంత్రి ఎన్. జనార్ధన్‌రెడ్డి కుమారుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని వైసిపి అధిష్టానం వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా నియమించిన విషయం తెలిసిందే. బుధవారం నెల్లూరులో కొత్తూరు లోని రామ్‌కుమార్ నివాసంలో ఆయన అనుచరులు హంగామా చేశారు. గూడూరు, వెంకటగిరి, వాకాడు ప్రాంతాల నుంచి వచ్చి అభినందనలు తెలిపారు. నేదురు మల్లి అను చరులు తరలి రావడంతో కోలాహలంగా మారింది. నెల్లూరు నుంచి వెంకటగిరి వరకు 50 కార్లతో ర్యాలీ నిర్వహించారు. వెంకటగిరి లోనూ నేదురుమల్లి నివాసం వద్ద హంగామా చేశారు. కార్యక్రమంలో నేదురుమల్లి గ్రూపు నేతలు మాత్రమే కనిపించారు. ఆనం, నేదురుమల్లి గ్రూపులుగా విడిపోయారు. వెంకటగిరి రాజులు ఎటువైపు ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది. వెంకటగిరిలో మూడు గ్రూపులు ఎవరికి వారు అన్నట్లు ఉన్నారు.

'ఆనం' విఫలమయ్యారు-నేదురుమల్లి

ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయ పరచడంలో విఫల మయ్యారు. అందుకే ముఖ్యమంత్రి తనను వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా ఇంఛార్జ్‌గా ఉన్నా, కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్నా, ఇప్పుడు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడే వెంకటగిరి ఎంఎల్ఎ అభ్యర్థి ఎవరనే చెప్పలేం. ఇంకా ఒకటి న్నరేళ్ల సమయం ఉంది. అప్పుడు సిఎం నిర్ణయం ప్రకారం నడుచుకుంటాం.

కలువాయి వలంటీర్ల సమావేశంలో ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి విఠపు

డివైఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు

దేశంలో యువత సమస్యలు పరిష్కరించే విధంగా పోరాడే యూత్ ఆర్గనైజేషన్ డివైఎఫ్ఐ 2023 జిల్లా క్యాలెండర్‌ను యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు, తిరుపతి, ప్రకాశం ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం హాజరై నూతన సంవత్సర క్యాలెండర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద యువజన సంఘంగా డివైఎఫ్ఐ ఎదిగి ఉన్నదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగ సమస్యలు పరిష్కారం దిశగా అనేక పోరాటాలు నిర్వహించి విజయం సాధించిన ఘనత డివైఎఫ్ఐకే దక్కుతుందన్నారు. అదేవిధంగా మహనీయులు వర్ధంతులు, జయంతులు సందర్భంగా రక్తదానం చేయడం, మొక్కలు నాటడం చలివేంద్రాలు ఏర్పాటు చేయటం ఇలా అనేక రకాల సేవా కార్యక్రమాలు యువజన సంఘం నిర్వహిస్తుందన్నారు. దేశంలో ఎక్కడైనా ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు విరాళాలు సమీకరణ చేసి నష్టపోయిన వారికి అందేలా డివైఎఫ్ఐ కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.సి నరసింహ, ఎంవి రమణ, కండే కోటేశ్వరరావు, వంక దార్ శ్రీనివాసులు, ఫయాజ్, శ్రీనివాసులు, సతీష్, శేఖర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

రావూరు

ఏపీ ఎన్జిఒ అసోసియేషన్ రావూరు తాలూకా అధ్యక్షులు ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గౌరవ మండల అభివృద్ధి అధికారి శ్రీ ఆమోస్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరవ అభివృద్ధి అధికారి ఎన్జీవో సభ్యులందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ విజయ్ శేఖర్,సెక్రటరీ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ రాజేంద్ర, కాం తమ్మ, బాలకష్ణ రెడ్డి,ఉద్యోగులు పాల్గొన్నారు .

నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో వామపక్ష నాయకులు, కార్యకర్తలు నిరసన తెలుపుతున్న దృశ్యం

జిఒ నెంబర్ ఒకటిని రద్దు చేయాలి

-గాంధీబొమ్మ సెంటర్‌లో వామపక్షాల నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, రోడ్డు షోలు అడ్డుకుంటూ వైసిపి ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబరు ఒకటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ లెఫ్ట్ పార్టీలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. బుధవారం గాంధీబొమ్మ సెంటర్‌లో సిపిఎం, సిపిఐ, పౌరహక్కుల సంఘం తదితర పార్టీల ఆధ్వర్యంలో ప్రభుత్వం అర్ధరాత్రి సమయంలో విడుదల చేసిన జిఒ నెంబరు ఒకటిని రద్దు చేయాలంటూ నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విడుదల చేసిన ఈ జిఒ ప్రజల గొంతు నొక్కే విధంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, సభలు, రోడ్డు షోలను నిషేధిస్తూ వైసిపి ప్రభుత్వం జిఒ విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ పాలనలో లోపాలను ఎత్తి చూపిస్తూ, ప్రజలవైపు నిలిచి నిరసన ప్రదర్శనలు చేయడం నేరమా అని అన్నారు.జిల్లాలో వరుసగా దళితులపై దాడులు జరుగుతున్నాయి, అధికార పార్టీ నాయకుల వేధింపులు తాళలేక అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ ఘోరాలను నిరసన ప్రదర్శనలు, రోడ్డు షోలు, సభలు నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రజల హక్కు అన్నారు. అంతే కాకుండా మహిళలపై దాడులు, నిత్యావసర వస్తువుల ధరలు పెరగటం వంటివాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలంటే నిరసన ప్రదర్శనలు, రోడ్డు షోలతోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు వైసిపి ప్రభుత్వ పాలనపై నమ్మకాన్ని కోల్పోయి అభద్రతా భావంతో జీవిస్తున్నారన్నారు. అందుకు నిదర్శనమే ఈ జిఒను విడుదల చేయడం అన్నారు.ఈ జిఒ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే విధంగా ఉందన్నారు. అధికార పార్టీ వారు రోడ్డు షోలు, పాదయాత్రలు, ప్రదర్శనలు, సభలు సమావేశాలు చేసుకోవచ్చు.. అందుకు భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేసుకుంటారు, ప్రతిపక్షానికి చెందిన రాజకీయ పార్టీలు రోడ్డు షోలు, ప్రదర్శనలు, పాదయాత్రలు, సభలు సమావేశాలు చేసుకుంటే నేరం, ఇదేనా ప్రభుత్వ పాలన అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలకు ఒక నీతి.. అధికార పార్టీకి మరో నీతా అని ప్రశ్నించారు. కందుకూరు, గుంటూరు ప్రాంతాల్లో టిడిపి నిర్వహించిన సభల్లో ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబరు ఒకటిని తక్షణమే రద్దు చేయాలని , ఆ విధంగా నిర్ణయం తీసుకొని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పార్టీలతో కలుపుకొని భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, బత్తల కృష్ణయ్య, పి.సూర్యనారాయణ, మూలం ప్రసాద్, కట్టా సతీష్, సిపిఐ నాయకులు రామరాజు, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు , బికెఎంయు నాయకులు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పొగాకు రైతుకు వడ్డీ లేని రుణం

ప్రజాశక్తి-కందుకూరు: పొగాకు రైతుల విజ్ఞప్తి మేరకు ఇటీవల రాష్ట్రంలో వచ్చిన తుపాన్ వలన పొగాకు పంట నష్టపోయిన ప్రతి రైతుకూ వడ్డీ లేని పంట రుణం ఇవ్వడానికి బోర్డు నిర్ణయించినట్లు ఆధికారులు తెలిపారు. పొగాకు పంట నష్ట పోయిన ప్రతి రైతుకూ రూ.10వేల చొప్పున ఇచ్చేందుకు పొగాకు బోర్డు నిర్ణయించింది. ఈ వడ్డీలేని పంట రుణం రూ.10వేలు కావలసిన పొగాకు పంట నష్టపోయిన ప్రతి రైతు మీయొక్క సూపర్వేజర్‌ను సంప్రదింప వలసినదిగా ఆధికారులు తెలిపారు. పొగాకు వేసిన ప్రతి పొగాకు రైతుకి పొగాకు బోర్డు ద్వారా రూ.10000 వడ్డీ లేకుండ రుణం ఇవ్వడం జరుగుతుంది. రైతులు కావాలసినవారు మీ యొక్క సూపర్వైజర్‌ను సంప్రదించి ధరఖాస్తు చేసుకోవలసిందిగా కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -కందుకూరు: సావిత్రిబాయి పూలే జయంతి సభ బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయుని గడ్డం ఈశ్వరమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించడం జరిగింది. స్త్రీ విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని, కుల వివక్ష లేని విద్యను అందించడం ద్వారా సమాజాభివృద్ధి తద్వారా దేశాభివద్ధి జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్ నాయక్ తెలిపారు. బిటిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లగుంట మోహన్ రావు మాట్లాడుతూ చరిత్రను వక్రీకరించడం ద్వారా ఎంతోమంది త్యాగధనుల జీవితాలు నేటికీ పూర్తిస్థాయిలో అందుబాటులో లేవన్నారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ టీచర్ సమస్యలతో పాటు సామాజిక సమస్యలు, రుగ్మతలను పారదోలడంలో ముందు ఉంటుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టా రమేష్, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, బండి గోవిందయ్యులు జోనల్ కన్వీనర్ షేక్ అబ్దుల్లాలు తెలిపారు. ఈ జయంతి సభలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులకు సన్మానం జరిగింది. కార్యక్రమంలో వలేటివారిపాలెం, పొన్నలూరు, కందుకూరు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, మండలాల బిటిఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, బిటిఎ సభ్యులు పాల్గొన్నారు.

టీచర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-ఉలవపాడు: మండలంలోని చాగొల్లు ఇందిరా నగర్ కాలనీలో కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రంలో భాగంగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ప్రతి గడపగడపకూ తిరుగుతూ పేదలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలితాలు అందరికీ. అందుతున్నాయా లేద అని అడిగి తెలుసుకున్నారు. రానివారికి మరల పరిశీలించాలని అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ జాలి రెడ్డి, ఎంపిడిఒ చెంచమ్మ , ఎంపిపి మస్తానమ్మ, జెపిటిసి అరుణ, తహశీల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్ ,పిఆర్ ఎఇ.కోటేశ్వరరావు ,ఎఇ రసూల్ బాషా, విద్యుత్ శాఖ ఎఇ నరసింహ రావు, హౌసింగ్ ఎఇ గౌస్ బాషా, స్థానిక సర్పంచ్ లతాచంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి భాస్కరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్ ఫార్మర్ చోరీ

ప్రజాశక్తి-పొదలకూరు: మండలంలోని పెదరాజుపాళెం గ్రామంలో మంగళవారం రాత్రి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ చోరీకి గురైంది. స్థానిక రైతుకు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. సుమారు లక్ష రూపాయలు విలువ చేసే త్రిఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ను గుర్తు తెలియని దుండగులు విద్యుత్ వైర్లను కత్తిరించి ట్రాన్స్ ఫార్మర్ ను అపహరించినట్లు తెలిపారు. ఆ ట్రాన్స్ ఫార్మర్ కింద 8 కనెక్షన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ట్రాన్స్ ఫార్మర్ లోని రాగితీగల కోసమే దుండగులు ఇలాంటి పనికి ఒడిగట్టారని వాపోయారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌కో సిబ్బంది కండలేరు డ్యామ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ట్రాన్స్ ఫార్మర్ కింద సమారు 30 ఎకరాలు ఆయకట్టు ఉంది.అధికారులు సకాలంలో స్పందించి కొత్త విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

క్రీడాకారులకు 'ప్రకాశం'లో సత్కారం

ప్రజాశక్తి-కందుకూరు: జాతీయస్థాయి క్రీడాకారులను కందుకూరు ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులు సత్కరించింది. బుధవారం ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల హాకీ గోల్‌కీపర్‌గా ఎంపికైన పి.నందిని, టార్గెట్ బాల్ 8వ సబ్ జూనియర్ జాతీయస్థాయి పోటీలకు రజిత పథకం సాధించిన క్రీడాకారులు జి రవిచంద్ర, కె అశోక్‌లను కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య సన్మానించారు. ఈ సందర్భంగా కంచర్ల రామయ్య మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడం వారికి ఆర్థికంగా సహాయం చేసిన క్రీడాకారులు ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధిస్తారని, తద్వారా దేశానికి పథకాలు సాధించగలరని చెప్పారు. ప్రతేడాది విద్యారంగంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి, క్రీడల్లో పథకాలు సాధించిన వారిని ఆహ్వానించి వారిని సన్మానం చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, టెక్నికల్ డైరెక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్, జూనియర్ కళాశాల పిడి టి సుబ్బారావు, టార్గెట్ బాల్ కోచ్ ఎం కామరాజు, ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల అకాడమిక్ ఇన్‌ఛార్జి ఎస్‌ఎం మీరావాలి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న కంచర్ల రామయ్య

గుండెపోటుతో ఆటో కార్మికుడు మృతి

ప్రజాశక్తి-నెల్లూరు : ఆటో కార్మిక సంఘం, అయ్యప్పగుడి సెంటర్ ఆటో స్టాండ్ సభ్యుడు మనోహర్ గుండెపోటుతో మృతిచెందాడు. బుధవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆయన స్వగృహంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ సమాచారం తెలుసుకున్న సిపిఎం, సిఐటియు నాయకులు మనోహర్ భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు డి.సంపత్‌కుమార్, శాఖ కార్యదర్శి ఎస్‌కె కాలేషాలు మాట్లా డుతూ మనోహర్ ఆటో కార్మిక సంఘం, సిఐటియు ,సిపిఎం నిర్వహించిన అనేక పోరాట ఉద్యమాల్లో అలుపెరగకుండా పోరాడారని కొనియాడారు.అంత్యక్రియలో అయ్యప్ప గుడి ఆటో స్టాండ్ కార్మికులు, హౌసింగ్ బోర్డ్ ఆటో స్టాండ్ కార్మికులు, చంద్రబాబు నగర్ ఆటో స్టాండ్ కార్మికులు అధిక సంఖ్యలో తమ మాటలతో అంతిమయాత్ర నిర్వహించడం ,అందరిని ఆ కట్టుకునే విధంగా అంత్యక్రియల ఆటోర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాబు, అయ్యప్ప గుడి ఆటో స్టాండ్ కార్యదర్శి శంకర్ కార్మిక సంఘాలు నాయకులు కార్యకర్తలు, అనేకమంది పాల్గొన్నారు.

మనోహర్ మృతదేహం

అధిక శబ్దాలు చేస్తే వాహనాలు సీజ్

ప్రజాశక్తి-నెల్లూరు: నగరంలో ద్విచక్రవాహనాలకు విపరీతమైన ధ్వని పుట్టించే సైలెన్సర్లు ఏర్పాటు చేసుకొని ప్రయాణం చేయడం నేరమని, అందుకు విరుద్ధంగా ఎవరైనా ప్రయాణిస్తుంటే అటువంటి ద్విచక్రవాహనాన్ని పోలీసులు సీజ్ చేస్తారని అడిషనల్ ఎస్పి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాలు సమీపంలో ట్రాఫిక్ పోలీసుల సమక్షంలో 173 వాహనాలకు సంబంధించిన సైలెన్సర్లను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పి (ఎఆర్) శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్పి సిహెచ్ విజయరావు ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేసి అధిక శబ్దాలు చేస్తూ, ప్రజలకు, తోటి వాహన దారులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తూ, ధ్వని కాలుష్యానికి కారణమౌతున్న సైలెన్సర్లను వాహనదారులచే ఊడదీయించి, ఒరిజినల్ సైలెన్సర్లు బిగించేలా చర్యలు తీసుకున్నారు. ఇకపై ద్విచక్రవాహనాలకు ఇటువంటి సైలెన్సర్లను విక్రయించే దుకాణ యజమానులపై, వాహనాలకు బిగించే మెకానిక్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బ్రెయిలీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి -గుడ్లూరు: మండలంలోని నాన్ భవిత కేంద్రంలో బుధవారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ మారుతీ రావు, డిప్యూటీ తహశీల్దార్ రమేష్, వెలుగు ఏపీఓ వినయ్, ఎంపీపీ ఎస్ గుడ్లూరు పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీహరి పాల్గొన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రా విద్యార్థి గత సంవత్సరం చనిపోయిన సందర్భంగా వారి తల్లిదండ్రులు, మిత్ర జ్ఞాపకార్థం ప్రతి పిల్లవాడికి ఒక జత దుస్తులు, టిఫిన్ బాక్స్‌లను అందజేశారు. వచ్చిన ప్రతి విద్యార్థికి భోజనం ఏర్పాట్లు చేశారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉలవపాడు: సంక్షేమ ఫలాలను అనుకున్న సమయానికి లబ్ధిదారులకు అందిచడంలో సిఎం జగన్మోహన్‌రెడ్డికి సాటి ఎవరు లేరని కందుకూరు శాసనసభ్య మానుగుంట మహీధర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలం పరిషత్ కార్యక్రమంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. నూతనంగా మంజూరైన రెండు వందల తొబై అయిదు పెన్షనుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎల్ చెంచమ్మ, యంపిపి మస్తానమ్మ, జెపిటిసి అరుణ, వైఎంపిపిలు ఫజుల్, రమణయ్య, కోఆప్ సభ్యులు ఖాదర్ బాషా, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్వదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు: కృష్ణాజిల్లా మచిలీపట్నానికి సమీపంలోని గూడూరు సద్గురు రామ్ రతన్ జి ఆశ్రమంలో నిర్మిస్తున్న 108 అడుగుల బాబా స్థూపానికి మన్నేటికోటకు చెందిన గడ్డం శ్రీనివాసరావు భార్య సబిత రూ.50116లు విరాళాన్ని స్థూపం కమిటీ సభ్యులు దామా వెంకయ్యకి అంద జేశారు. ఈ సందర్భంగా అంకయ్య మాట్లాడుతూ షిరిడి సాయిబాబా పరమపదించి 100 సంవత్సరాలు సందర్భంగా శ్రీ సాయిబాబా వాక్కుతో గూడూరులో సద్గురు రామ్ రతన్ జీ ఆశ్రమంలో 108 అడుగుల బాబా స్తూపాన్ని, స్తూపం చైర్మన్ శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వ ర్యంలో సుమారు 5కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నా మని తెలిపారు. స్థూపం నిర్మాణం పూర్తికావస్తుందని తెలిపారు. . స్థూపం లో శ్రీ సాయిబాబా జీవిత చరిత్రకు సంబంధించిన చిత్రాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కొండూరి వసంతరావు, సూరం వేణుగోపాల్ రెడ్డి, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు

కందుకూరు శ్రీ అంకమ్మ తల్లి ఆలయ పున:నిర్మాణం శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా శరవేగంగా జరుగుతుంది. యాత్రికులు అమ్మవారి ఆలయానికి తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. మన్నేటికోటకు చెందిన గడ్డం శ్రీనివాసరావు భార్య సబిత రూ.50116లు విరాళంగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు సూరం వేణుగోపాల రెడ్డి, కొండూరు వసంతరావు, అంకయ్య పాల్గొన్నారు.

మినుముల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-కందుకూరు: మినుముల కొనుగోలు కేంద్రం కందుకూరు వ్యవసాయం మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ మార్క్ ఫ్రైడ్ జిల్లా మేనేజర్ ఎస్ పవన్ కుమార్ తెలిపారు. స్థానిక ఎఎంసి కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో పవన్ కుమార్‌తో పాటు కందుకూరు ఎఎంసి సెక్రటరీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని లక్ష్యంతో కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి కోరిన మేరకు మినుముల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. క్వింటా రూ.6600కు కొనుగోలు చేయడానికి అవకాశం ఉందని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.6600 కోనుగోలు చేసే అవకాశం ఉందని చెప్పారు. జిల్లాలో 9416 హెక్టార్‌లలో మినుము సాగు చేశారన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలలో 3200 హెక్టార్‌లలో మినుము సాగు జరిగిందని తెలిపారు. 7222 టన్నుల దిగుబడి జిల్లాలో వస్తుండగా ఒక కందుకూరు నియోజకవర్గంలోనే 2500 టన్నులు దిగుబడి అవకాశం ఉందని చెప్పారు. ఐదు మండలాలలో నూర్పిళ్లు జరుగుతున్నందున దళాదులు రైతులను మోసం చేయకుండా ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి నిర్ణయించినట్లు చెప్పారు. పూర్తి నాణ్యమైన మినుములను మాత్రమే ఈ కేంద్రంలో నా ఫైడ్ సంస్థ ద్వారా మార్క్ ఫైడ్ కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు లేని వాటిని ఇక్కడ కొనుగోలు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇటీవల తుపాను కారణంగా దెబ్బతిన్న మినుములు కొనుగోలు చేయడానికి ఈ కేంద్రం ఉపయోగం పడదా అని విలేకరుల ప్రశ్నించగా వాటిని తాము కొనుగోలు చేసే అవకాశం లేదన్నారు. మినుములను జల్లేడు పట్టి రైతులు తొలగించుకొని నాణ్యమైనవి మాత్రమే కేంద్రానికి తీసుకురావాలని చెప్పారు. ఇక్కడ కొనుగోలు చేసిన మినుములను గోడౌన్ లో తనిఖీ చేసి నాణ్యత ఉంటేనే అంగీకరిస్తారని, అలా లేని వాటిని తిరిగి వెనక్కి పంపించే అవకాశం ఉందని చెప్పారు. తుపాన్ కు నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ వచ్చే అవకాశం ఉంది కాబట్టి దానినే ఉపయోగించుకోవాలని సూచించారు. మార్క్‌ఫైడ్ ద్వార అమ్మకాలు చేయదలిచిన రైతులు ఈ నెల 18తేదీ లోపు ఆర్‌బికె కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కొనుగోలు చేసిన మినుములకు 15 రోజుల్లో నేరుగా రైతులకు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని చెప్పారు. 14 శాతం తేమ మించి ఉండకూడదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఎఒ గీతా ప్రకాష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేనేజర్ పవన్ కుమార్

దళితులపై దాడులు అమానుషం

నేడు దగదర్తిలో సదస్సు, ర్యాలీ

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో దళితులపై జరుగుతున్న వరుస దాడులను నిరసిస్తూ కెవిపిఎస్ జిల్లా కమిటీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నేడు దగదర్తిలో సదస్సు, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కుల వివక్షత పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో కెవిపిఎస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కావలి ఏరియా లో అధికార పార్టీ నాయకుల వేధింపుల కారణంగా దుగ్గిరాల కరుణాకర్ ఆత్మహత్య, పైడి హర్షల ఆత్మహత్య చేసుకోవడం, దగదర్తి మండలం ఉలవపాళ్ళ హైవే పెట్రోల్ బంకులో పనిచేస్తున్న గోచిపాతల తేజ పై అదే మండలానికి చెందిన బాడుగులపాడు ఎంపిటిసి వైసిపి నాయకులు, మహేష్ నాయుడు తన అనుచరులతో కలిసి విచక్షణా రహితంగా దాడికి పాల్పడటం, అంతే కాకుండా కులం పేరుతో దూషించడం, హత్యా ప్రయత్నం చేయడం వంటి చర్యలను నిరసిస్తూ సదస్సు, ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం తేజ నెల్లూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్నాడు. వరుసగా దాడులు జరుగుతున్న నిందితులకు అధికార పార్టీ అండదండలు ఉండడం, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు నమోదు చేయకుండా పోలీసులు నిందితులకే అనుకూలంగా వ్యవహరించడంతో కఠినంగా శిక్ష పడకపోవడంతో దళితులపై దాడులు పునరావతం అవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో దళితులపై దాడులు ఆగాలంటే అట్రాసిటీస్ కేసులు నమోదు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. ఇదే అంశంపై దగదర్తి మండలంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన ర్యాలీ, సదస్సుకు దళితులందరూ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జి సుధీర్, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు నాగయ్య, కమిటీ సభ్యులు జి.పెంచలయ్య, పచ్చ. మధు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరి తిరుపాలు, తదితరులు

కొనసాగుతున్న డ్రైవర్ల రిలే దీక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థకు చెందిన చెత్త ఎత్తే వాహన డ్రైవర్లు తమ వేతన బకాయిలు చెల్లించాలంటూ వారం రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నారు. బుధవారం చెత్త ఎత్తే వాహన డ్రైవర్ల రిలే దీక్షా శిబిరానికి రూరల్ సిఐటియు, నగర డివైఎఫ్ఐ కమిటీలు హాజరై తమ సంఘీభావాన్ని తెలియజేశారు. దీక్షలకు మద్దతు ఇచ్చిన వారిలో సిఐటియు సిటీ నాయకులు పి సూర్యనారాయణ, వై రంగయ్య, పెంచలయ్య, డివైఎఫ్ఐ రూరల్ కార్యదర్శి కండె కోటేశ్వరరావు, నాయకులు డబ్బుగుంట శ్రీనివాసులు, బి సతీష్, లవర్‌కుమార్ తదితరులున్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఇందుకూరుపేట ఎస్ఐ వాసు పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడిపందేలపై, పేకాట స్థావరాలపై నిఘా ఉంచామని, తమ కళ్లు గప్పి నిర్వహిస్తే నిర్వహకదారులను, జూదకారులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రజలందరూ సంతోషంగా పండగలు జరుపుకోవాలని తెలిపారు.

ప్రజల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-అల్లూరు : ప్రజల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిపి దర్శిగుంట శశిరేఖ వెల్లడించారు. బుధవారం మండలంలోని ఇస్కపల్లి గ్రామంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మొబైల్ ఎటిఎంను ప్రారంభించారు. బ్యాంకు మేనేజర్ కిష్టయ్య, సర్పంచ్ పాటి రంజిత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, బీద రమేష్‌యాదవ్, దర్శిగుంట వెంకయ్య, చైర్మన్ తంబివాసు తదితరులున్నారు.

ఆరోగ్యకేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-వరికుంటపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ ఆయుషా, సిహెచ్ఓ రాజశేఖర్ తెలిపారు. ముఖ్యంగా సిసికెమెరా ఏర్పాటు ముఖ్య ఉద్దేశం వ్యాధి గ్రస్తులకు సరైన ఆరోగ్య సేవలు అందించడం సిబ్బంది హాజరు నిమిత్తం, భద్రత దృష్ట్యా సిసి కెమెరా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆయేషా మాట్లాడుతూ వరికుంటపాడు పరిధిలోని గ్రామాల ప్రజలు ఆరోగ్య కేంద్రానికి వచ్చి తమ ఆరోగ్య సమస్యలను డాక్టర్ ద్వారా నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కృష్ణంపల్లి జెడ్‌పి హైస్కూల్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న సంగ్రహణాత్మక పరీక్షల విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఇండియన్ గ్యాస్ అందించాలని వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి : మూడు నెలల ఆగి ఉన్న ఇండియన్ గ్యాస్‌ను అందించాలని బుధవారం వినియోగదారులు డిప్యూటీ తహశీల్దార్ ఫజీహకు వినతి పత్రం అందజేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో వెంకట్రావు పల్లి, కొండాయపాళెం, మాసాయిపేట, గానుగపెంట పల్లి వినియోగదారులు షేక్ గౌస్‌బాషా, షేక్.నాగూర్ బాషా, రవికుమార్, వెంకటేష్, కాలేషా, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి-కొడవలూరు : బ్యాంకుపై ఆరోపణలు చేస్తూ పత్రికల్లో వచ్చిన వార్త, దీనిపై ప్రతిపక్షాల వారు చేసిన ఆరోపణలపై బుచ్చిరెడ్డిపాలెం వవ్వేరు కోపరేటివ్ రూరల్ బ్యాంకు చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికల్లో వచ్చిన వార్త అవాస్తవమని బ్యాంకుపై ఉన్నతాధికారులు ఎంక్వయిరీ చేశారని, ఇంకా ఎంక్వయిరీ నివేదిక అందలేదనీ, అలాంటప్పుడు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్టు ఎలావార్త రాస్తారని మండిపడ్డారు. బ్యాంక్ అభివృద్ధికి ప్రతిపక్షాలు సూచనలు సలహాలు స్వీకరించి మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిఇఒ శ్రీనివాసులు, వైసిపి నాయకులు పెద్ద అల్లాభక్షు, కోవూరు మురళి, రెడ్డిపాలెం సర్పంచ్ రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు పంట పరిశీలన

ప్రజాశక్తి మర్రిపాడు : మాండూస్ తుపాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు పడడంవల్ల దక్షిణ ప్రాంత తేలిక నేలల్లో పొగాకు పంట నష్టం జరిగిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన నష్టపోయిన పంటను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులకు పొగాకు బోర్డు ప్రత్యేకంగా పొగాకు బోర్డు రైతు సంక్షేమ నిధి నుండి ప్రతి రైతుకు రూ.10వేలను అందిస్తామన్నారు. వడ్డీ లేని పంట రుణం కావాల్సిన రైతులు బోర్డు క్షేత్ర సహాకులను సంప్రదించాలన్నారు.

వాటర్ బాటిల్స్ వితరణ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : స్థానిక భవిత కేంద్రంలో లూయీ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా సహారా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం వికలాంగులకు ప్లేట్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపిడిఒ డి.వి. నరసింహారావు మాట్లాడుతూ అంధులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలని, కృషి పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎం.దిలీప్‌కుమార్, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వి.శకుంతల, సహిత విద్య, ఉపాధ్యాయులు సిహెచ్ శేషమ్మ, బి.శ్రీనివాసులు రెడ్డి, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

6న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కావలి : గుండెమడుగుల దేవదానం మెమోరియల్ హాస్పిటల్‌లో శుక్రవారం ఉదయం 9గంటల నుండి డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో అయన కుమారుడు, ఎన్.సాయివర్షన్ జన్మదినం సందర్భంగా నెల్లూరు కిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగాసూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం, గుండెమడుగుల దేవదానమ్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడు తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ ఎ.వి.రెడ్డి, ప్లాస్టిక్ సర్జన్, డాక్టర్ సాహెబ్ పీర్, గుండె వ్యాధి నిపుణులు, డాక్టర్ మస్తాన్ వలీ, నెఫ్రాలజిస్ట్, డాక్టర్ ఉదయ్ కిరణ్, న్యూరాలజిస్ట్, డాక్టర్ వంశీకృష్ణ, గ్యాస్ట్రోసర్జన్, డాక్టర్ శశిభరత్ రెడ్డి, పల్మనాలజీ, డాక్టర్ శ్రీహర్ష జనరల్, డైబెటాల్ జిస్ట్, డాక్టర్ మంజీర, చర్మవ్యాధి నిపుణులు, డాక్టర్ సుధీర్ కుమార్ గుండె వ్యాధి నిపుణులు, డాక్టర్ వినయ్ వినోద్ బాబు, దంత వైద్య నిపుణులు, పాల్గొంటారని తెలియజేశారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం విక్రమ సింహపురి కళాశాలల జోనల్‌స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం పిడి సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, కరస్పాండెంట్ సనిశెట్టి రాధాకృష్ణయ్య, ప్రిన్సిపాల్ గొల్ల వరకుమారి, యూనివర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ అమరి ప్రవీణ్ కుమార్ పాల్గొని ప్రారంభించారు.

'యువశక్తి' జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో 12వ తేదీన జనసేన పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన యువశక్తి కార్యక్రమానికి యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి నలిశెట్టి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం ప్రజల ఆశీర్వాదంతో కొనసాగుతున్న పవనన్న ప్రజాబాట కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమలో నాయకులు వంశీ, చంద్ర, నాగరాజు, ఆనంద్, భాను, మల్లికార్జున, వెంకట రమణయ్య, మణి, హజరత్, తదితరులున్నారు.

వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని వెలగపాడు గ్రామ పంచాయతీలోని వెలగపాడు గ్రామంలో జెడ్‌పిటిసి పాలూరు మాల్యాద్రిరెడ్డి సమాకూర్చిన రూ.5 లక్షల జెడ్‌పి నిధులతో ఏర్పాటు చేయనున్న శుద్ధిజలాలను అందించే వాటర్ ప్లాంట్‌కు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి మాట్లాడుతూ వెలగపాడు ప్రజలకు మినరల్ వాటర్ అందించేందుకు జెడ్‌పిటిసి పాలూరు మాల్యాద్రిరెడ్డి గొప్ప మనసుతో జెడ్‌పి నిధులను కేటాయించడం ఆయన సహృదయానికి నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట సుబ్బయ్య, వైసిపి ప్రచార కార్యదర్శి బి సత్యం, వైసిపి నాయకులు కొండారెడ్డి, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్తి సమాచారాన్ని అందించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై జరిగే సామాజిక తనిఖీ బృందానికి పూర్తి సమాచారం అందించి సహకరించాలని ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎపిఒ శ్రీనివాసులు, ఎస్‌ఆర్‌పి సుబ్బారావు, డిఆర్‌పిలు, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని నెర్దనంపాడులో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం టిడిపి మండలాధ్యక్షుడు జనార్దన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటా తిరిగి జగన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలకు వివరించారు. ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని నమోదుచేసుకున్నారు. టిడిపి పోరాటాలకు ప్రజలు అండగా ఉండాలని 9261292612 నెంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి బాలగురవమ్మ, గ్రామాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, గురుస్వామీ రెడ్డి తదితరులున్నారు.

జిఒ నెంబర్ ఒకటిని ఉపసంహరించుకోవాలి

అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకులు

ప్రజాశక్తి-కావలి
వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జిఒ నెంబర్ 1ను వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో బుధవారం కావలి అంబేద్కర్ విగ్రహం వద్ద జిఒ కాగితాలను తగులబెట్టారు. జిల్లా సిపిఎం కమిటీ సభ్యులు పసుపులేటి పెంచలయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, కాంగ్రెస్ నాయకుడు చింతాల వెంకట్రావు, టిడిపి నాయకుడు గుత్తికొండ కిషోర్‌బాబు, సిపిఐ ఎం ఎల్ లక్ష్మి రెడ్డి, సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ కరవది భాస్కర్, జనసేన నాయకుడు పోబ్బా సాయి విఠల్ మాట్లాడారు. నెల్లూరు జిల్లా కందుకూరు, గుంటూరులలో ప్రతిపక్ష నాయకుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభల్లో వరుసగా తొక్కిసలాటల ఘటనలు సాకుతో, ప్రజా వ్యతిరేక అణచివేసే ప్రతిపక్షం పీక నొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివాదస్పద జిఒ నెంబర్ 1ను బ్రిటీష్ కాలంనాటి 1861 పోలీసు చట్టం హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా అర్ధరాత్రి తర్వాత ఉత్తర్వులు జారీశారన్నారు. రోడ్లు పైబహిరంగ సభలు ర్యాలీలు చేయక్నదని షరతులతో కూడిన పోలీసు యాక్ట్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన సంవత్సరం కానుగా జిఒ నెంబర్ 1 ను తీసుకొచ్చిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ జిఒను ఉపసంహరించు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకుడు కె.నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎ.సుబ్రమణ్యం, టిడిపి నాయకులు కాకి ప్రసాద్, గుత్తికొండ కిషోర్ బాబు, నాయకులు, తదితరులున్నారు.

రైతులకు సరిపడా యూరియాను అందించాలి

- ఎపి రైతు, వ్యవసాయ కార్మికసంఘాల వినతి

ప్రజాశక్తి - కావలి
కావలి డివిజన్‌లోని రైతుల పొలాలకు సరిపడా యూరియాను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ బుధవారం ఆర్‌డిఒ కార్యాలయంలో డిఎఒ ఆర్.సూర్యనారాయణసింగ్‌కు ఎపి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ రైతుల పొలాలకు సరిపడా యూరియాను ప్రభుత్వం నిర్ణయించిన రూ.267.లకు కావలి టౌన్, రూరల్‌మండలం, జలదంకి మండలాలలోని వ్యాపారస్తులు ఇవ్వడం లేదన్నారు. ప్రయివేటు వ్యాపారులు రూ.330, రూ.360, రూ.380 అధిక ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. అదీ కూడా కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇస్తామంటూ పోటీ పెట్టి అమ్ముతున్నారని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ


వినతి పత్రం అందజేస్తున్న వ్య.కా.సం.నాయకులు

రైతు భరోసా కేంద్రాలలో 'ఈక్రాప్' చేయించుకున్న రైతులకే యూరియాను అరకొరా ఇస్తున్నారని తెలిపారు. కనుక 'ఈక్రాప్'కు సంబంధం లేకుండా, కాంప్లెక్స్ ఎరువులకు పోటీ పెట్టకుండా, రైతులకు వారిపొలాలకు సరిపడా యూరియాను ప్రభుత్వం నిర్ణయించిన ధరల(రూ.267.లు.)కే యూరియాను ఇప్పించాలని కోరారు. కార్యక్ర మంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పి.సీతారామయ్య, ఎ.పి.రైతు సంఘం నాయకులు ఏ.యానాదయ్య పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల ఆందోళన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
మండలంలోని మహిమలూరు గ్రామంలోని సిండికేట్ ఫార్మర్ సొసైటీ భవనం వద్ద తమకు సరిపడా ఎరువులు ఇవ్వాలంటూ రైతులు ఆందోళన చేపట్టారు. ఎకరాకు ఆరు బస్తాలు అవసరమైతే అరబస్త కూడా ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేసిన రైతులు.. మూడు రోజులు నాలుగు రోజులు సొసిటీ భవనం వద్ద పడి గాపులు పడితే ఒకటి లేదా రెండు బస్తాలు మాత్రమే వస్తున్నాయని రైతులు ఆవేదన వెళ్లబుచ్చారు. ఓ దశలో సిబ్బందితో తీవ్ర వాగ్వాదం పెట్టుకున్న తర్వాత కొందరికి ఒకటి రెండు బస్తాలు ఇచ్చి మళ్లీ లేవని ఆపివేయడంతో రైతులు ఆందోళనకు దిగారు. తమకు స్టాకు వచ్చిన విధంగానే రైతులకు యూరియా ఇస్తున్నామని సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ ప్రాంతం పూర్తిగా వ్యవసాయ ప్రాంతమని ప్రస్తుతం వరి పైరు సాగులో ఉన్నందున ప్రతి ఒక్కరికీ ఎరువులు అవసరమని ఒక ఎకరాకి సుమారు ఆరు బస్తాలు అవసరం ఉండగా ఇక్కడ సరిపోయినంత ఎరువులు ఇవ్వడం లేదని పైఅధికారులు కలుగజేసుకొని సరిపడా ఎరువులు అందించాలని కోరారు. సొసైటీ పరిధిలో సుమారు 3 వేలఎకరాల వరి సాగులో ఉన్నట్టు రైతులు తెలిపారు.

నాడు-నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి-వరికుంటపాడు
మండలంలోని రొంపిదొడ్ల గ్రామంలోని హైస్కూలు సంబంధించిన నాడు-నేడు పనులను బుధవారం కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి, అధికారులకు కాంట్రాక్టులకు తగు సూచనలు చేశారు. నిర్ణీత కాలంలో పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. తర్వాత వరికుంటపాడు మండలంలోని తహశీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించిన సబ్ కలెక్టర్ తహశీల్దారు హమీద్‌కు తగు సూచనలు చేశారు. మండలంలో జరుగుతున్న భూ పంపిణీపై జగనన్న శాశ్వత భూ హక్కు భూ రీసర్వే పలు అంశాలపై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వరికుంటపాడు సర్పంచ్ కొండేపోగు దిలీప్ సబ్ కలెక్టర్ దృష్టికి పలు భూ సమస్యలను తీసుకురాగా వాటిని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని తహశీల్దారు హమీద్‌కు సూచించారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు భూ సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని సంబంధిత అధికారులకు సూచనలు చేసి త్వరితగతిన వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

కావలి సిపిఐ కార్యదర్శిగా నాగరాజు

ప్రజాశక్తి-కావలి
కావలి నియోజకవర్గ సిపిఐ కార్యదర్శిగా కొప్పర్తి నాగరాజు, సహాయ కార్యదర్శిగా పోతిపోగు సుభాష్ చంద్రబోస్‌లు నియమితులయ్యారు. బుధవారం కావలి సిపిఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సమితి కార్యదర్శి దామా అంకయ్య వీరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బలిజెపల్లి వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన

ప్రజాశక్తి-కావలి
పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రంగనాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక డికె కమ్యూనిటీ హాల్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ కార్మికులును ఆప్కాస్ విధానంలోకి తీసుకొని, కాంట్రాక్ట్ దలారీ వ్యవస్థకు ప్రభుత్వం కాపు కాస్తుందన్నారు. గత ప్రభుత్వం 279 జిఒ అని ఈ ప్రభుత్వం ఆకాశాన్ని కార్మికుల రక్తాన్ని తాగుతున్నారని తెలిపారు. క్యాబ్ డ్రైవర్లుకు ఎస్ఐ ఈపిఎఫ్ వేతనంలో రికవరీ చేస్తున్నారన్నారు. కానీ క్యాబ్‌డ్రైవర్ ఖాతాలోకి జమ కావడం లేదన్నారు. వీరికి రూ.18,500 వేతనం ఇవ్వాలని, 62 సంవత్సరాలు నిండిన కార్మికులను నిలిపివేసిన తర్వాత వారికి గ్రాడ్యుటీ, వారి కుటుంబంలో నుండి ఒకరికి ఉద్యోగం కల్పించాలని విధులలో కరోనాకాలంలో చనిపోయిన కార్మికులకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలన్నారు. అనంతరం

మాట్లాడుతున్న రంగనాయకులు

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరు జాన్ మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న ప్రభుత్వం నేటికీ పర్మనెంట్ చేయకుండా పోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26,000 వేతనం ఇవ్వాలన్నారు. కార్మిక సమస్యలపై వారు మాట్లాడి కార్మికసమస్యలు పరిష్కరించక పోతే ఉద్యమబాట తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి.గుంజి కిషోర్, అధ్యక్షులు ఆదినారాయణ, గౌరవాధ్యక్షులు మల్లె అంకయ్య, నాయకులు వై.ప్రభావతి, టి.రమాదేవి, బిరాజేష్, రవికాంత్, పి.వరప్రసాద్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ కనుసన్నల్లో పెట్రేగుతున్న రౌడీయిజం

ప్రజాశక్తి-కావలి
"కావలిలో రౌడీయిజం చేస్తే తాట తీస్తాను" అన్న ఎంఎల్ఎ ప్రతాప్‌కుమార్ రెడ్డి దగదర్తి మండలం ఉలవపాళ్ల పెట్రోల్ బంకు వద్ద దళిత యువకుడు తేజపై దాడి చేసిన వారిని కాపాడుతున్నారని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి జిల్లా నాయకులు పందింటి అంబేద్కర్, గోచిపాతల వెంకటేశ్వర్లు, పట్టణ నాయకులు ఏసు, కిరణ్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని "జర్నలిస్ట్ క్లబ్"లో వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత మూడు రోజుల క్రితం దగదర్తి మండలం ఉలవపాళ్ల పెట్రోల్ బంకు వద్ద పనిచేసే దళిత యువకుడు గోచిపాతల తేజ, ఎంపిటిసి మహేష్ నాయుడు ఆయన అనుచరులు అతి కిరాతకంగా కాళ్లతో, రాడ్లతో దాడిచేసిన వారిపై పోలీసులు ఇంతవరకు కేసులు నమోదు చేయకపోవటం దారుణమన్నారు. దాడి చేసిన

మాట్లాడుతున్న నాయకులు

వారిపై 24 గంటలలో 307, అట్రాసిటీ కేసు నమోదు చేయకపోతే కావలిలో జరిగే పరిణామాలకు పోలీసులు, ఎంఎల్ఎ ప్రతాప్‌కుమార్ రెడ్డే కారణం అవుతారని తెలిపారు. దళితులపై జరిగిన దాడులను ఖండించాల్సిన కొందరు దళిత నాయకులు అగ్రవర్ణాలకు బానిసలుగా బతుకుతు న్నారన్నారు. కావలిలో జరిగిన సంఘటనలను ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగకు కూడా తెలిపామన్నారు. తేజపై దాడిచేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేయకపోతే కావలి కేంద్రంగా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ నాయకత్వంలో పెద్ద ఉద్యమం జరుగుతుందని హెచ్చరించారు. దానికి పోలీసులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి మహిళ నాయకురాలు జానకి, నాయకులు శివ, మనోహర్, తిరపతి, నారాయణ, దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

నల్లపరెడ్డి వ్యాఖ్యలు సరికావు..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట
తమ అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు కోవూరులో నిర్వహించిన భారీ బహిరంగ సభకు అశేష జనం రావడం చూసి కోవూరు ఎంఎల్ఎ ప్రసన్నకుమార్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు సరికాదని టిడిపి మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్ర చౌదరి ధ్వజమెత్తారు. బుధవారం మండలంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గం నుండి ఎవరు టిడిపి కార్యకర్తలు బహిరంగ సభకు హాజరు కాలేదని. సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట, గూడూరు, ఆత్మకూరు, కావలి నుండి మనుషులు వచ్చారనీ ఎంఎల్ఎ ప్రసన్న కుమార్ రెడ్డి అనడం విడ్డూరంగా ఉందన్నారు. కోవూరులోని ఒక్క ఇందుకూరుపేట మండలం నుంచి 7వేల నుండి 8 వేల వరకు స్వచ్ఛందంగా ప్రజలు హాజరయ్యారని తెలిపారు. ఆ ర్యాలీకి మీ కార్యకర్తలు నోరేళ్ల పెట్టడమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నేత ఎస్‌కె.ఇంతియాజ్, కొండూరు సుధాకర్‌రెడ్డి, మునగాల రంగారావు, బట్టేపాటి సురేష్ నాయుడు, గంపలా అనిల్, బొద్దుకూరు సుధాకర్, తదితరులున్నారు.

వలంటీర్ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-వరికుంటపాడు
మండలంలోని విరువూరు గ్రామ సచివాలయ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులు భర్తీ చేయాలని సచివాలయ పరిధిలోని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్ల బట్వాడా, సచివాలయానికి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో ఉన్న వెల్ఫేర్‌పై పని ఒత్తిడి పెరిగి ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని అంటున్నారు. వలంటీర్ల కొరత వల్ల సచివాలయ పరిధిలోని 250 పెన్షన్లను వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్‌దారులకు ఇచ్చారు. సంబంధిత అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న వలంటరీ పోస్టులను భర్తీ చేస్తే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు వీలవుతుందని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులుగా గిరిధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

వైసిపి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులుగా కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నియమిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి విశ్వసనీయతకు పార్టీ అధిష్ఠానం మరో పదవిని అప్పగించింది. బుధవారం ఈ సమాచారం నగరంలోని రూరల్ వైసిపి కార్యాలయానికి అందడంతో గిరిధర్‌రెడ్డి అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. అభినందనలు తెలిపిన వారిలో డిప్యూటి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, రాజ రాజేశ్వరి అమ్మవారి దేవాలయం చైర్మన్ అలహరి విజయ్, మేయర్ దంపతులు పి.స్రవంతి, పి.జయవర్ధన్, పట్టబద్రుల ఎంఎల్‌సి స్థానానికి పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాం, రూరల్ సమన్వయ కర్త మన్నేపల్లి రఘు, షంషుద్దీన్, కార్పొరేటర్లున్నారు.

చెరువు కలుజుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

- మాజీ ఎంఎల్‌సి బూదాటి రాధయ్య

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు చెరువు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలనే, దశాబ్దాల కలను నెరవేర్చుకోవాల్సిన బాధ్యత గుమ్మళ్లదిబ్బ, పాటూరు ప్రజలపై ఉన్నదని బూదాట రాధయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం మొదలైతే కోవూరు చెరువు కలుజు ప్రయాణం ఆటంకంగా మారుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక గ్రాండ్ ఇచ్చి బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరారు. కోవూరు పట్టణానికి అతి తక్కువ సమయంలో చేరుకునే ప్రధాన రహదారి అంతే కాకుండా ముంబై రోడ్డులో నుంచి నేషనల్ హైవే లింక్ రోడ్డుగా ఉందని ఈ బ్రిడ్జి నిర్మాణం చేస్తే రైతులుకు చేనేత వస్త్ర వ్యాపారులు రోజువారీ కూలీలకు చిరు వ్యాపారులకు రోజూ వందలాది వాహనాల్లో ప్రయాణం చేస్తుంటారు ప్రయాణానికి ఆటంకం కలిగించే కలుజుపై బ్రిడ్జి రాకపోకలకు ఎంత అవసరమని తెలిపారు. ప్రయాణం లేకుండా ఏ ఒక్క కుటుంబం ఇంట్లోనే ఉండలేరని నిరంతరం తమ అవసరాలు తీర్చుకోవడానికి నెల్లూరు కోవూరు ప్రతి ఒక కుటుంబం ప్రయాణం చేస్తారని తెలిపారు. ప్రయాణానికి ఆటకం కలిగిస్తున్న ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన కలుజుపై బ్రిడ్జి నిర్మాణాన్ని ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు గుర్తించి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వ్య.కా.సం.జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శేషయ్య, సోమాగోపాల్, గాదిరాజు సుదయ్య, బాబు, గండవరం శ్రీనివాసులు, తన్నీరు శివ సురేంద్ర, సురేష్, కాలేషా, అప్రోజ్, చాన్‌బాషా, విజయ్‌కుమార్, జానకిరామ్, బుజ్జియ్య, పెద్దబ్బయ్య ఖాదర్‌బాషా, సురేంద్ర, వెంకటేష్, తదితరులున్నారు.

నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-దగదర్తి : మండలంలోని ఉలవపాళ్ల గ్రామం వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌వ వద్ద దళిత యువకుడు గోచిపాతల తేజపై దాడి చేసిన వైసిపి ఎంపిటిసి వెలినేని మహేష్ నాయుడు, తన డ్రైవర్ మడక మస్తాన్‌లను బుధవారం అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచామని కావలి డి.ఎస్.పి వెంకటరమణ తెలిపారు. తడికలూరు సర్పంచి ఆత్మకూరు గిరినాయుడు వాళ్ల అన్న చనిపోవడంతో పరామర్శించేందుకు వెళుతున్న ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సున్నపుబట్టి దగ్గర విలేకరుల కనబడడంతో దాడి విషయాన్ని అడగ్గా ఏ పార్టీ నాయకులైన చట్టం ముందు సమానమేని అన్నారు. నియోజకవర్గంలో ఎవరైనా గానీ రౌడీయిజాన్ని ప్రదర్శిస్తే అట్టువారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ప్రజాసేవ చేసేవారెవరైనా టిడిపిలోకి స్వాగతిస్తాం..

- వాక్ స్వాతంత్ర్యాన్ని అడ్డుకొనేందుకే జిఒ నెంబర్ ఒకటి

ప్రజాశక్తి-నెల్లూరు : నిస్వార్థంతో అనునిత్యం ప్రజాసేవ చేసే వారు ఎవరైనా సరై టిడిపిలోకి వస్తామంటే తాము స్వాగతిస్తామని, భారత రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్య హక్కును కాలరాసేందుకే వైసిపి ప్రభుత్వం జిఒ నెంబరు 1 విడుదల చేసిందని మాజీ మేయర్, టిడిపి రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అబ్దుల్ అజీజ్ అన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. 160 సంవత్సరాల ముందు బ్రిటీష్ ప్రభుత్వ జిఒను జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి లాంటి వారు పార్టీలోకి వచ్చే ప్రయత్నం చేస్తే అడ్డుకుంటామని తెలిపారు. దళితులపై దాడులను నిరసిస్తూ అన్ని పార్టీలను సమన్వయం చేసుకొని 9న చలో కావాలి కార్యక్రమం నిర్వహిస్తున్నా మని, దళితులపై దాడులు చేస్తున్న ఏ ఒక్కరినీ వదిలి పెట్టేది లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి జెన్నీ రమణయ్య, సురేంద్రబాబు, కప్పిర శ్రీనివాసులు, రాజా నాయుడు, మేకల నరేంద్ర రెడ్డి, జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, గంగాధర్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు : రూరల్ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వి.భాస్కర్ (హెచ్‌సి-2117) రోడ్డు ప్రమాదంలో 2022వ సంవత్సరం జులై 10వ తేదీన మృతి చెందారు. మృతుడి గ్రూప్ పర్సనల్ ప్రమాద బీమా కింద భాస్కర్ భార్య శారదకు రూ.20 లక్షలా 90 వేల చెక్కును ఎస్‌పి సిహెచ్ విజయరావు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి(అడ్మిన్), అడిషనల్ ఎస్.పి(ఎస్ఈబి), ఏఓ పి-సూపరింటెండెంట్, మతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటగిరి వైసిపి ఇన్‌ఛార్జిగా 'నేదురుమల్లి'

ప్రజాశక్తి-రాపూరు : నూతనంగా వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా రాపూర్‌కి విచ్చేసిన నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డికి రాపూరు నేదురుమల్లి వర్గ వైసీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్, నారాయణరెడ్డి, మధురెడ్డి, సుబ్బారెడ్డి, వరబాబు, తదితరులున్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి-ఉదయగిరి
గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులు పరిశీలించి సిబ్బందికి వైద్యాధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో కొత్త భవనంలో కార్యకలాపాలు ప్రారంభించడం కోసం విద్యుత్ సరఫరా విషయం గురించి కావలి డివిజనల్ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం వైద్యశాల ఖాళీగా ఉన్న ఒక వైద్యులు, ఇద్దరు స్టాఫ్ నర్సుల ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శివ కల్పన, సిహెచ్ఒ శివకుమారి, ఆరోగ్య పరిరక్షకులు అక్బర్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వ్యాధినిరోధక టీకాలు కార్యక్రమాన్ని పరిశీలించారు. జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సి.దివ్య మాట్లాడుతూ నీటిలో ఫ్లోరిన్ శాతం అంచనా వేయుటకు గ్రామాల నుండి వాటర్ శ్యాంపిల్స్ పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కల్పన, డాక్టర్ గోపినాధ్, మండల ఆరోగ్య విస్తరణ ఆధికారి జావిద్, ఆరోగ్య పర్యవేక్షులు తిరుపతమ్మ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పింఛన్లు అందజేత

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో పెన్షన్ వారోత్సవాలలో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ల విషయంలో చిన్నచిన్న సమస్య ఉందని పాత పెన్షన్ల సమస్య పరిష్కరించామన్నారు. ఎవరూ ఇంటి నుండి బయటకు వెళ్లొద్దని వాలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పనిచేస్తారని తెలిపారు. ఇంతకు ముందులా కమిటీల దగ్గరకు, పార్టీ రంగు వేసుకొని ఎవ్వరికీ చెప్పుకోవలసిన పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మీదేవి, కన్వీనర్ సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులునాయుడు, వైసిపి నాయకులు సిద్ధంరెడ్డి మోహనరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రవీంద్రబాబు, ఎంపిడిఒ నాగమణి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వాలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-రాపూరు : మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పెంచిన పింఛను అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, తహశీల్దార్, తదిత అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : మండల కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పాల్గొని పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, నవీన్ రెడ్డి, పుండ్ల అచ్యుత్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకుడు కొండూరు వెంకటసుబ్బారెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలో అర్హులైన 193 లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ గోవిందరాజు, మండలం కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, జెడ్‌పిటిసి కీర్తన, ఎంపిపి మేకల సుజాత, బోగోలు సర్పంచ్ అనిత, ఎంపిటిసి సుందర్‌రాజ్, నాయకులు, ఎంపిటిసిలు సర్పంచులు పాల్గొన్నారు.

చెరువుకు బహిరంగ వేలంపాట

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వెంకటాచలం మండలంలోని పాలిచెర్లపాడు గ్రామ పంచాయితీకి సంబంధించిన పాలిచెర్లపాడు చెరువుకు సంబంధించి **ఫసలీ నెం.1432** చేపలుపట్టుకునే హక్కుకై వేలంపాట జరుగును. **తే 12-01-2023 ది ఉదయం గం॥ 10.00** లకు పాలిచెర్లపాడు గ్రామ సచివాలయం నందు నిర్వహించబడునని తెలియజేయడమైనది. సదరు వేలంపాటకు మండల విస్తరణ అధికారి పాల్గొని అధ్యక్షత వహించబడును. కావున ఈ వేలంపాటలో పాల్గొనే వారు ఎవ్వరైనా పంచాయితీ వారు నిర్ణయించిన రుసుమును చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చును.

ఇట్లు
ఇ. రమేష్ కుమార్, సెక్రటరీ
పాలిచెర్లపాడు గ్రామ పంచాయితీ
వెంకటాచలం మండలం, సెల్: **83281 61008**

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన **M/s.LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్,** నెల్లూరు తరపున ఏరియా మేనేజర్ ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:-నాక్లయింట్‌కి కస్టమర్ అయిన **శ్రీ కమతం డానియేల్ రాజ్ కుమార్** తండ్రి **జయరాజు,** నివాసం : డోర్ నెం. 24-1-1023, నీలగిరి సంఘం, మూలాపేట, నెల్లూరు సిటీ అను వారికి ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిలో 1/2 వ భాగమును **శ్రీ కమతం డేవిడ్ రాజ్ కుమార్,** తండ్రి **జయ ప్రకాష్** గారు రిజిష్టర్డు హక్కు విడుదల పత్రం తేది: 10-10-2022 డాక్యు మెంటు నెం.4828/2022 ద్వారా మరియు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిలో మిగతా 1/2 వ భాగంను శ్రీమతి కమతం రాజమ్మ గారు రిజిష్టర్డు వీలునామా తేది: 20-10-2010 డాక్యుమెంటు నెం.340/2010 ద్వారా సంక్రమించినదని, సదరు కమతం రాజమ్మ క్రింది షెడ్యూలు ఆస్తిని శ్రీమతి కైలాస ఫాతిమ గారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయ పత్రం తేది: 02-06-1988 డాక్యు మెంటు నెం.3543/1988 ద్వారా కొనుగోలు చేసినారని చెప్పుచున్నారు. సదరు డానియేల్ రాజ్ కుమార్ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యు మెంటు నెం.3543/1988 రును తేది : 25-12-2022 న నెల్లూరు బస్సు స్టాఫ్ సెంటర్‌లో జెరాక్స్ తీసుకొంటుండగా పోయినదని, చుట్టుప్రక్కల విచారించినను ఒరిజినల్ లింకు డాక్యుమెంటు కనిపించలేదని చెప్పుచున్నారు. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం.3543/1988 రు ఎవ్వరికైనను దొరికినయెడల పై తెలిపిన నా క్లయింట్ అడ్రస్సుకు గానీ లేదా ఈ క్రింది తెలిపిన అడ్రస్సుకు గానీ తెచ్చి ఇవ్వవలసినదిగా కోరడమైనది.

ఆస్థి షెడ్యూలు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ యిలాకా, నెల్లూరు సబ్-రిజిస్ట్రారులో చేరిన నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో చేరిన, నెల్లూరు బిట్-1, సి.ఎ. యస్.నెం.1468రు, నెల్లూరు నగరం, నీలగిరి సంఘం ఏరియాలోని భూమి లే-అవుట్ ప్లాను దాఖలా సర్వేయరు వారి సర్వే రిపోర్టు ప్రకారం సర్వే నెం.1468/2 రుకు రాబడిన ప్లాట్లులో నెం.128 రు ప్లాటు విస్తీర్ణం 15 అంకణములు లేక 120 చదరపు గజములు స్థలము, యిందులోని వార్డు నెం.24-1 రు, డోరు నెం. 1023 రుకు సంబంధించిన అసెస్‌మెంటు నెం.1031036206 రు గల ఆర్.సి.సి.మిద్దెయిల్లు వగైరాలకు హద్దులు:-తూర్పు: కమతం జయరాజు గారి స్థలం, దక్షిణం: డి.కె.డబ్ల్యూ. ప్రహరీగోడ, పడమర: గరికపాటి సోమయ్య గారి యిల్లు, ఉత్తరం: జయప్రకాష్ గారి ఇంటి గోడ వెంబడి ఈ స్థలం తాలూకు స్వంతదారి.

యస్.వి.విజయలక్ష్మీ, ఎం.కాం., బి.ఎల్.,
అడ్వకేట్, డోర్ నెం.20-1-189,మొదటి అంతస్తు,
సరస్వతి సమాజం ప్రక్కన, మూలాపేట,
నెల్లూరు-524003. సెల్: **98660 22728, 2306263.**